క్లుప్తంగా

పంచముఖ హనుమ విగ్రహ నిర్మాణం

పుంగనూరు : చౌడేపల్లె మండలం ఎ.కొత్తకోట గ్రామ సమీపంలో 60 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం నిర్మిస్తున్నారు. బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్కే రమణారెడ్డి తన సొంత నిధులతో విగ్రహ నిర్మాణం చేపట్టారు. మంగళవారం ఈ మేరకు రమణారెడ్డి మాట్లాడుతూ ఒకవైపు హనుమ, మరో వైపు పరమేశ్వరుడు ఉండేలా విగ్రహ నిర్మాణం సాగుతోందన్నారు. మొత్తం రెండున్నర ఎకరాల్లో తూర్పున లక్ష్మీ గణపతి ఆలయం, సూర్య దేవాలయం, పడమటి వైపున కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఉత్తర దిశలో షిరిడీ సాయిబాబా , వినాయకుడు, సుబ్రమణ్యంస్వామి, దత్తాత్రేయస్వామి , అయ్యప్పస్వామి ఆలయాలు నిర్మించనున్నట్లు వివరించారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి?

పలమనేరు : పలమనేరు ఏరియా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన తల్లి మృతి చెందిందని గంగవరం మండలం బూడితపల్లికి చెందిన మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన ఆస్పత్రి వద్ద విలేకర్లతో మాట్లాడారు. తన తల్లి చినపాపమ్మకు గుండెనొప్పి రావడంతో ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చామన్నారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు గ్యాస్ట్రిక్ సమస్య ఉందని మందులు ఇవ్వగా కొద్దిసేపటికే మరణించిందని మండిపడ్డారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణిని వివరణ కోరగా చినపాపమ్మకు జనరల్ సర్జన్ సరోజిని ఈసీజీ తీశారని, అందులో ఎలాంటి గుండె సమస్య లేదని తేలిందన్నారు. తర్వాత ఉన్నట్టుండి హార్ట్ ఎటాక్ రావడం వల్లే ఆమె మరణించిందని వివరించారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు.

విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు

పుంగనూరు : పట్టణంలోని వెలసిన విరూపాక్షి మారెమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఎదుట భక్తులు నెయ్యి దీపాలు వెలిగించి, చల్ల ముద్దలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


మాట్లాడుతున్న డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్

రొంపిచెర్ల: మండలకేంద్రంలోని కేజీబీవీ, బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. దోమలు వ్యాప్తి చెందే అవకాశముందని తెలిపారు. విద్యార్థులు రోగాల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. జ్వర లక్షణాలు కనపడితే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి చికిత్సలు పొందాలని కోరారు. అనంతరం విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ సుజాత, బీసీ హాస్టల్ వార్డెన్ సురేష్‌కుమార్ రెడ్డి. సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

సదుం : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి చరణ్ సూచించారు. మంగళవారం మండలంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల, సంక్షేమ హాస్టళ్లను ఆయన సందర్శించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. నీరు నిల్వ చేరిన ప్రాంతాల్లో గంబూసియా చేప పిల్లలన వదలినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది నీలకంఠ, శిఖామణి, సీహెచ్‌ఓ రషీద్, శ్రావణి, కార్యకర్తలు సర్తాజ్, రేవతి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత..

బైరెడ్డిపల్లె : మండలంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లు, కమ్మనపల్లె గురుకుల పాఠశాల, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మంగళవారం ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నట్లు తెలిపారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వంట గది, తాగునీటి ట్యాంకులు, పరిసరాల్లో పారిశుద్ధ్యం ఎలా ఉందో పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభ, అనిత, సీహెచ్‌ఓ అనూరాధ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పాల్గొన్నారు.

అంటు వ్యాధులపై అవగాహన

పలమనేరు : మండలంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అంటు వ్యాధులపై మంగళవారం కొలమాసనపల్లె ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. వైద్యాధికారి అనూక్య మాట్లాడుతూ వర్షాల నేపథంయలో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. హాస్టళ్ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వసతి గృహాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఎస్‌డబ్ల్యూఓ హైమావతి, హాస్టల్ వార్డెన్లు శీనప్ప, మధుసూదన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పలమనేరు బాలిక హాస్టల్ ఆవరణలో మురుగు గుంత



ఈ నీటినే పిల్లలు తాగాల్సింది!



బాలికల హాస్టల్‌లో అపరిశుభ్రంగా నీటి సంపు



వసతి.. అధోగతి

వసతి గృహాల్లో నరకకూపాలను తలపిస్తున్నాయి.. పారిశుద్ధ్యం లోపించడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి.. హాస్టల్ గదుల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.. ఫ్యాన్లు పనిచేయకపోవడంతో విద్యార్థులపై యథేచ్ఛగా దాడి చేసి వారిని రోగాల బారిన పడేస్తున్నాయి.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన వాటర్‌ప్లాంట్లు నిర్వహణలోపంతో నిరుపయోగంగా మారిపోయాయి.. కాసుల కక్కుర్తితో సిబ్బంది వడ్డిస్తున్న నాసిరకం ఆహారా పదార్థాలను తిని పిల్లల ఆరోగ్య స్థితిగతులు దారుణంగా తయారయ్యాయి.. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువై వసతిగృహాలు వ్యాధులకు అడ్డాగామారాయి.

- సంక్షేమ.. గురుకుల హాస్టళ్లలో అధ్వానంగా పారిశుద్ధ్యం
- నిరుపయోగంగా వాటర్ ప్లాంట్‌లు
- కలుషిత నీటితోనే దాహం తీర్చుకుంటున్న విద్యార్థులు
- కిటీకీలకి మెష్ లేకపోవడంతో గదుల్లోకి చేరుతున్న దోమలు
- పనిచేయని ఫ్యాన్లు.. ఉక్కపోతలో పిల్లలు
- నాసిరకం కూరగాయలతో ఆహార పదార్థాలు
- నాణ్యతలేని భోజనం తినలేక పిల్లల అవస్థలు

పలమనేరు : పలమనేరు నియోజకవర్గంలోని 15 ఎస్సీ, బీసీ, గురుకుల, సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితి అధ్వానంగా తయారైంది. మంగళవారం ఈమేరకు సాక్షి విజిట్‌లో నివ్వెరపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. అసలే వానాకాలం కావడంతో హాస్టళ్ల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ లేక అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. దీంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. మరోవైపు పిల్లలకు మంచినీటి సమస్యలు సైతం తప్పడం లేదు. గత ప్రభుత్వం మంజూరు చేసిన వాటర్‌ప్లాంట్‌లను ఇప్పుడు వాడడం లేదు. కరెంట్ చార్జీల ఆదా పేరిట ఇవి మూలనపడేశారు. ఇక కిటీకీలకు మెష్‌లు కొట్టక, పనిచేయని ఫ్యాన్ల కారణంగా విద్యార్థులకు దోమల బెడద తప్పడం లేదు. కొన్ని హాస్టళ్లలో సిబ్బంది కొరత, మరికొన్ని చోట్ల వయసు మీరుతున్న సిబ్బంది కారణంగా పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది.


గదులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థినిలు


దోమలకు ఆహ్వానం పలుకుతూ మెష్ లేని కిటికీ

పలమనేరులో ఇదీ పరిస్థితి..

పలమనేరులోని బాలికల హాస్టల్‌లో 3 నుంచి 10వ తరగతి దాకా 80 మంది పిల్లలు ఉన్నారు. వీరికి తాగేందుకు శుద్ధజలం కూడా అందుబాటులో లేదు. నిత్యం మున్సిపాలిటీ నుంచి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని సంపులోకి నింపుకొని వాటినే పిల్లలకు అందిస్తున్నారు. ఆ సంపును సక్రమంగా శుభ్రం చేయక సూక్ష్మజీవులకు నిలయంగా మారింది. ఆ కలుషిత నీటినే పిల్లలు తాగుతున్నారు. ఇక హాస్టల్‌లోని వ్యర్థపు నీటిని అక్కడే వదలిపెట్టేశారు. దీంతో అక్కడ నిల్వ నీరు చేరి దుర్వాసన వెదజల్లుతూ పురుగులు తేలుతున్నాయి. గదుల్లో దోమలు రాజ్యమేలుతున్నాయి. హాస్టల్‌లో పరిశుభ్రత అటకెక్కింది. సాక్షి అక్కడ విజిట్ చేస్తుండగా అప్పటికప్పుడు వార్డెన్, సిబ్బంది పిల్లలతోనే గదులను శుభ్రం చేయించడం కనిపించింది. ఇదేమని ప్రశ్నిస్తే ఇక్కడున్న ఇద్దరు సిబ్బంది వృద్ధులని ఏ పనులు చేయలేరని సమాధానమివ్వడం గమనార్హం.


కిటికీకి చిరిగిపోయిన మెష్


దెబ్బతిన్న టమాటాలే దిక్కు


నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్

ఎస్సీ బాలుర హాస్టల్‌లో..

గుడియాత్తం రోడ్డులోని ఎస్సీ–1, ఎస్సీ–2 హాస్టళ్లలో దోమలు బెడద ఎక్కువగా ఉంది. ఇక్కడ గతంలో కిటికీలకు అమర్చిన మెష్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని గదుల్లో కనీసం ఫ్యాన్లు కూడా లేవు. పిల్లలను దోమలు కుడుతున్నా పడి ఉండాల్సిన పరిస్థితి. ఈ క్రమంలోనే ఇక్కడి సిబ్బంది నాసికరం కూరగాయలను కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. వీటితోనే నాణ్యత లేని ఆహారం తయారు చేసి పిల్లలకు వడ్డిస్తున్నారు.

హాస్టల్‌లోకి అనుమతించరు



నా కుమార్తె ఇక్కడే ఏడో తరగతి చదువుతోంది. బిడ్డను చూద్దామని వచ్చా. కనీసం హాస్టల్ లోపలికి అనుమతించకుండా బయటే ఉండమన్నారు. హాస్టల్‌లో సౌకర్యాలు ఎలా ఉన్నాయో మాకు చూపడం లేదు. మేం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నాం. వారి బిడ్డల్లాగే కదా మా పిల్లలు కూడా. హాస్టల్ సిబ్బంది బాగా చూసుకుంటారనే నమ్మకంతోనే హాస్టల్ ఇక్కడ ఉంచాం.

– హరికుమార్, విద్యార్థిని తండ్రి, నాలుగురోడ్లు

భయపడి వచ్చేశా



ఇక్కడి బీసీ హాస్టల్‌లో పిల్లల ఆరోగ్య సమస్యలపై వైద్య సిబ్బందితో కలసి ఇక్కడికి వచ్చాం. హాస్టల్‌లో దోమలు చుట్టుముట్టేశాయి. దీంతో భయపడి రోడ్డు పక్కకు వచ్చేశా. వర్షాకాలం నేపథ్యంలో దోమలు మరీ ఎక్కువగా ఉన్నాయి. ఈ దోమల కారణంగానే ఇప్పుడు పిల్లలకు వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయి.

శోభ , ఆశావర్కర్, పాతపేట



కమనీయం.. కల్యాణం

చౌడేపల్లె :మండలంలోని కొలింపల్లెలో ఉన్న రామాలయంలో మంగళవారం కమనీయంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మూలవర్లకు విశేష అభిషేకం, పూజలు జరిపించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. వేద మంత్రాల నడుమ కనులపండువగా కల్యాణం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై కల్యాణ వేడుకను తిలకించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలోనే వీరాంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదాన ప్రసాదం పంపిణీ చేశారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

వి.కోట: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ విష్ణు రఘువీర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో అమ్మాయిల ఫొటోలను మార్ఫింగ్ చేసి వాళ్ల మానప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. సెల్‌ఫోన్‌ల దుర్వినియోగం కారణంగా పలువురు నష్టపోతున్నట్లు వెల్లడించారు. కొందరు యువతీయువకులు తెలిసీ తెలియక మత్తు పదార్థాలను అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు జల్సాలకు అలవాటు పడి చిన్న వయసులోనే నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మైనర్లు బైక్‌లు నడిపి వారి ప్రాణాలనే కాకుండా ఎదుటివారిని కూడా ప్రాణాపాయానికి గురిచేస్తున్నారని వివరించారు. అనంతరం రోడ్డు భద్రతా నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ లింగప్ప, ఎస్‌ఐ బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణు రఘువీర్

నిలువెత్తు నిర్లక్ష్యం

పర్యవేక్షణ కొరవడితే పాలన పట్టు తప్పుతుంది.. పట్టించుకునేవారు లేకపోతే అంతటా నిర్లక్ష్యం తాండవిస్తుంది.. చౌడేపల్లె ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ పీహెచ్‌సీని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 24/7 సేవలందించే సెంటర్‌గా గుర్తించింది. ఆ మేరకు సిబ్బందిని నియమించింది. వసతుల కల్పించింది. అయితే సర్కారు మారగానే సేవల సరళి మారిపోయింది. సమయపాలన లేకుండా వైద్యులు వెళ్లిపోతున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులను మెడిసిన్స్ బయటి దుకాణాల్లో కొనుగోలు చేసుకోమని చీటీ రాసిచ్చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఖరీదైన మందులను వృథాగా మూలన పడేస్తున్నారు. ఉన్నతాధికారులు చూసీచూడనట్టు ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే సమాధానం దాట వేస్తున్నారు.


చౌడేపల్లె పీహెచ్‌సీ

- అధ్వానంగా చౌడేపల్లె పీహెచ్‌సీలో సేవలు
- సిబ్బంది నిర్వాకంతో వృథాగా మారిన రూ.లక్షల మందులు
- సాయంత్రం 4 గంటలకే వెళ్లిపోతున్న వైద్యులు
- పేరుకే 24/7.. అమలు కాని ప్రభుత్వ ఆదేశాలు

చౌడేపల్లె : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్య రక్షణకు పెట్టపీట వేసింది. అందులో భాగంగా పేదల కోసం రూ.లక్షలు విలువైన మందులను పీహెచ్‌సీలకు సరఫరా చేసింది. అయితే చౌడేపల్లె ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో వైద్యుల నిర్లక్ష్యం పేద రోగుల పాలిట శాపంగా పరిణమించింది.

ఇదిగో సాక్ష్యం

ఏటా మూడు నెలలకు ఓసారి ప్రభుత్వాస్పత్రులకు మందులు అందుతుంటాయి. ఈ క్రమంలోనే చౌడేపల్లె పీహెచ్‌సీకి కూడా మందులు వచ్చాయి. అయితే ఇక్కడి వైద్యసిబ్బంది సదరు మందులను రోగులకు పంపిణీ చేయలేదు. రూ.లక్షల విలువైన మందులను పీహెచ్‌సీ సమీపంలోని శిథిలావస్థ భవనంలో పడేశారు. వృథాగా పడేసిన మందుల్లో ఖరీదైన ప్రెగబాలిన్ 75 ఎంజీ, మెకోబాలమైన్ 1550 ఎంజీ మందులు ఉండడం గమనార్హం. వీటిని న్యూరో సమస్యలతో బాధపడే వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు వాడుతుంటారు. అలాగే టెల్మిసార్టన్ 40 ఎంజీ మందులు బీపీ, కొలెస్ట్రాల్ అదుపులోకి తెచ్చేందుకు వినియోగిస్తారు. ఈ మందులు 5 బాక్స్‌లలో సీల్ కూడా తీయకుండా పడేశారు. ఈ క్రమంలోనే ఎక్స్‌పైర్ కానీ ఐరన్ సిరప్ సీసాలను కూడా మూల గదిలో వృథాగా పడేసి ఉన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఉన్న మందులు ఇవ్వకపోగా బయట షాపులో తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తాము ఇబ్బందిపడుతున్నామని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందులు ఉన్నప్పటికీ తమకు అందించడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మూలనపడేసిన ఖరీదైన మందులు

అడిగితే విసుక్కుంటున్నారు!

చౌడేపల్లె పీహెచ్‌సీని రౌండ్‌దిక్లాక్ ఆస్పత్రిగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో వైద్యులతో పాటు సిబ్బంది సైతం 24 గంటల పాటు రోగులకు అంటుబాటులో ఉండాల్సి ఉంది. అయితే ఇక్కడ మాత్రం సాయంత్రం 4 గంటలు దాటితే డాక్టర్లు అందుబాటులో ఉండరు. ఓపీ సమయంలో రోగులతో సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారు. మందులు, సేవలకోసం అడిగితే విసుక్కుంటున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర వైద్యానికి వస్తే కనీసం పరీక్షించకుండానే పుంగనూరు, మదనపల్లె ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ప్రమాదకరంగా నీటి సంపు

పీహెచ్‌సీ ఆవరణలోని నీటి సంపు ప్రమాదకరంగా ఉంది. ఇందులో నీరు నిండుగా ఉన్నప్పటికీ మూత లేదు. దీంతో నీటిలో చెత్త చెదారం పడుతోంది. ఈ నీటిని వాడితే రోగాల బారిన పడే అవకాశముంది. ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలో పిల్లలు ఆడుకుంటూ ఉంటారు. మూత లేని సంపులో ప్రమాదవశాత్తు పడిపోతే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తుంది. దీనిపై అధికారులు స్పందించి సంపుపై మూత వేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వివరణ.. మౌనం

పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు అందించకుండా ఖరీదైన మందులను ఎందుకు వృథాగా మూలనపడేశారని వైద్యాధికారి పూజను ప్రశ్నిస్తే ఆమె కనీసం స్పందించలేదు. అవసరమైన మందులు ఉన్నప్పటికీ ఎందుకు రోగులకు ఇవ్వడంలేదని అడిగితే మౌనమే సమాధానమైంది. 24/7 ఆస్పత్రిలో సేవలు అందించాల్సి ఉంటే సాయంత్రం తర్వాత వైద్యులు ఎందుకు అందుబాటులో ఉండడం లేదని ప్రశ్నిస్తే.. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు మాత్రమే తాము ఉంటామని ఆమె బదులిచ్చారు. మిగిలిన సమయాల్లో సిబ్బంది ఉంటారని తెలిపారు.


గడువు ఉన్నప్పటికీ పడేశారు..


బీపీ, న్యూరో సమస్యలకు వాడే మందులు ఇలా..


మూతలేని సంపు వద్ద ఆడుకుంటున్న పిల్లలు

ఘనంగా మొహర్రం వేడుకలు

బైరెడ్డిపల్లె : మండలంలోని బైరెడ్డిపల్లె, కడపనత్తం, లక్కనపల్లె, బాపలనత్తం, తీర్థం, బేలుపల్లె గ్రామాల్లో మంగళవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీర్లను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పీర్లను ఊరేగించారు. భక్తులు అగ్నిగుండంలో ప్రవేశించి మొక్కులు చెల్లించుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నందిని

పెద్దపంజాణి : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయలపేట పీహెచ్‌సీ వైద్యాధికారి నందిని హెచ్చరించారు. మంగళవారం ఆరోగ్య కేంద్రం పరిధిలోని బసవరాజు కండ్రిగలో ఆమె వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ రమేష్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, పీఎస్ మహేశ్వర్‌తో కలిసి గ్రామంలో పారిశుద్ధ్య పనులు, మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ వనజ, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఎస్ రాధాకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ వరలక్ష్మి, ఏఎన్‌ఎం సుజాత, అంగన్‌వాడీ కార్యకర్త సునీత పాల్గొన్నారు.

వాహనాల వేలం

పుంగనూరు : వివిధ కేసుల్లో పట్టుబడిన 23 వాహనాలను మంగళవారం రూ.4.72లక్షలకు వేలం వేశారు. ఈఎస్ శ్రీధర్‌రావు, ఏఈఎస్ రవి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు.

పలమనేరులో..

పలమనేరు : సెబ్ కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలను మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సెబ్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేశారు. ఇందులో ఏడు వాహనాల వేలం ద్వారా రూ.3.95లక్షలు వచ్చినట్లు శ్రీధర్‌రావు తెలిపారు.